23న ప్రకాశం పంతులు జయంతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆంధ్రకేసరి కీర్తిశేషులు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఈనెల 23వ తేదీన నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా బుధవారం ఉదయం పది గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ కార్యాలయ సిబ్బంది హాజరు కావాలని ఆదేశించారు.

వ్యసనాల వల.. విలవిల

- ఆకర్షణలతో దారితప్పుతున్న టీనేజర్లు
- మొదట సరదాగా మారి.. ఆపై ప్రమాదపు అంచులోకి
- తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరమంటున్న నిపుణులు

పదో తరగతి, ఇంటర్‌లో 90 శాతానికి పైగా మార్కులు వచ్చాయి. ఎంసెట్‌లో మంచి ర్యాంక్ రావడంతో పేరున్న ఇంజినీరింగ్ కళాశాలలో చేరాడు. మొదటి మూడు నెలలు కళాశాల కొత్త వాతావరణంలో బాగానే ఉన్నాడు. తర్వాత చేతికి ఫోన్ వచ్చింది. సమయం ఆదా అవుతుందని తల్లిదండ్రులు బైక్ కొనిచ్చారు. అంతే అక్కడ్నుంచి అతని జీవితంలో ఎంతగానో మార్పులు వచ్చాయి. రాత్రిళ్లు నిద్ర లేకుండా సెల్‌ఫోన్‌తో గడపడం, పగలు స్నేహితులతో గడపడం ఎక్కువైంది. పూర్తిగా వ్యసనాల అగాథంలో తమ కొడుకు చిక్కుకున్నాడన్న విషయాన్ని తల్లిదండ్రులు ఆలస్యంగా గుర్తించారు. మానసిక వైద్య నిపుణుల వద్దకు తీసుకెళ్లి కొడుకును కాపాడుకున్నారు.

మత్తు.. జీవితం చిత్తు..

పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా పార్టీల సంస్కృతి పెరిగిపోతోంది. తొలుత స్నేహితుల ఒత్తిడితో ఒకసారి తాగితే తప్పు లేదులే అని భావించి మద్యపానం చేస్తున్నారు. ఆ తర్వాత అదే అలవాటుగా మారుతోంది. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవిస్తున్నారు. మత్తులో మునిగితేలుతున్నారు. వివాహేతర సంబంధాలు పెట్టుకుంటున్నారు. జల్సాలకు అలవాటు పడి డబ్బు కోసం చోరీలు, ఇతర నేరాలకు పాల్పడుతున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎవరి జీవితంలోనైనా కౌమార దశ (టీనేజ్) ఎంతో కీలకమైంది. 13 నుంచి 19 ఏళ్ల మధ్య వయసు వారిని టీనేజర్లుగా పరిగణిస్తారు. భవితకు పునాది వేసుకునేది ఆ వయసులోనే. ఆకర్షణలకు కూడా లోనయ్యేది ఆ వయసులోనే. స్వేచ్ఛగా కొత్త ప్రపంచంలోకి అడుగు పెడుతున్న అనుభూతి కలుగుతుంది. హార్మోన్ల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. స్నేహాలు, అలవాట్లకు త్వరగా ఆకర్షితులయ్యే అవకాశం ఉంది. ఏది మంచో, ఏది చెడో దగ్గరుండి పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఎంతో ఉంటుంది. లేకుంటే పిల్లలు పెను ప్రమాదంలో చిక్కుకునే అవకాశం ఉంటుంది.

ర్యాగింగ్ వద్దే వద్దు

కళాశాలలో ర్యాగింగ్ సంస్కృతి చాప కింద నీరులా విస్తరించి ఉంది. జూనియర్లను ఏడిపించాలనో, సరదా కోసమో వేధింపులకు దిగితే ర్యాగింగ్ కేసులు నమోదై జైలు పాలవుతారు. టీనేజర్లు ఆకర్షణకు లోనై దానినే ప్రేమగా భావించి విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. ప్రేమించలేదని, మోసగించారని ప్రేమోన్మాదులుగా మారి దాడులకు పాల్పడుతున్నారు. కేసుల్లో చిక్కుకుని కటకటాల వెనుక ఊచలు లెక్కపెట్టాల్సి వస్తోంది.

నైతిక విలువలు పెంపొందించాలి

విద్యార్థులను స్మార్ట్‌ఫోన్‌కు దూరంగా ఉంచితే చాలా మంచిది. వారు చెడిపోవడానికి ఇవే ఎక్కువగా కారణ మవుతున్నాయి. తల్లిదండ్రులు పిల్లలను అతి గారాబం చేసి ఎక్కువ డబ్బులు ఇవ్వరాదు. వారి పోకడలు ఎప్పుడూ గమనిస్తూ ఉండాలి. ప్రవర్తనను పరిశీలించి దారి తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితం అంధకారం అవుతుందన్న విషయాన్ని వివరించి చెప్పాలి. చిన్నతనం నుంచి నైతిక విలువలు పెంపొందించేలా చూడాలి.

- పి.జగదీశ్వరరావు
డైరెక్టర్, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి

మార్గదర్శకమే ముఖ్యం

పిల్లలు దారి తప్పకుండా మార్గదర్శకం చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, గురువులపై ఉంది. కళాశాలలో చేర్పించగానే తమ పని అయిపోయిందని భావించరాదు. కళాశాలకు వచ్చి అధ్యాపకులను కలిసి ఏ విధంగా చదువుతున్నారో తెలుసుకోవాలి. విద్యార్థుల నడవడికను ఎప్పుడూ గమనిస్తూ ఉండాలి. చెడు స్నేహాలు, తప్పుడు మార్గం పట్టకుండా చూడాలి.

- నిమ్మ వెంకటరావు,
వైస్ ఛాన్సలర్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ

సెల్‌ఫోన్‌తో సర్వనాశనం

ఇంటర్, డిగ్రీ ఇంజినీరింగ్ కోర్సులు చదవడానికి ఇంటికి దూరంగా బయటకు వెళ్తున్నారు. తల్లిదండ్రులు, పెద్దల పర్యవేక్షణ తగ్గిపోతోంది. మారుమూల ప్రాంతాలకు ఇంటర్నెట్ సౌకర్యం విస్తరించింది. స్మార్ట్‌ఫోన్‌లో వీడియోలు చూస్తూ, కాల్స్ చేస్తూ ఆటలు ఆడుతూ ఎక్కువ సమయాన్ని గడిపేస్తున్నారు. ట్విట్టర్, ఫేస్‌బుక్, వాట్సాప్‌ల్లో మునిగిపోతున్నారు. పోర్న్‌సైట్లలో నీలి చిత్రాలు చూడటానికి అలవాటు పడుతున్నారు.

తల్లిదండ్రులూ గమనించండి

- టీనేజీ వయసు పిల్లలు దారి తప్ప కుండా చూడాల్సిన బాధ్యత తల్లి దండ్రులపై ఎంతో ఉంది. పిల్లలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. అవసరానికి మించి డబ్బు ఇవ్వరాదు. ప్రవర్తనను ఎప్పుడూ గమనిస్తూ ఉండాలి. ప్రేమగా మాట్లాడుతూ చెడు మార్గం పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- చిన్నతనం నుంచే పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించేలా కృషి చేయాలి. నిపుణులతో ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి, మంచి మార్గాన్ని ఎంచుకుని ముందుకు సాగితే జీవితం ఎంత బాగుంటుందో వివరించి చెప్పించాలి. ఫోన్‌ను సద్వినియోగం చేసుకోవడంపై అవగాహన కల్పించాలి.
- కష్టపడి ప్రణాళికాబద్ధంగా కృషి చేయడం ద్వారా స్ఫూర్తిదాయక విజయాలు సాధించిన వ్యక్తుల గురించి తెలియజేయాలి. సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలి. మంచి పుస్తకాలు చదవాలి.
- అనాలోచితంగా తెలిసీ తెలియక తప్పులు చేస్తే కలిగే నష్టంపై వివరించాలి. క్రమశిక్షణతో ఉండి బాగా చదివితే భవిష్యత్ ఎంత బాగుంటుందో చెప్పాలి. ఇష్టమైన క్రీడలు, కళల్లో శిక్షణ ఇప్పించి రాణించేలా ప్రోత్సహించాలి. ఓటమికి కుంగిపోకుండా మనోధైర్యాన్ని కల్పించాలి.

అక్షయ మృతదేహం (ఇన్‌సెట్‌లో అక్షయ (ఫైల్)

ఆయువు తీసిన అల

- సముద్రంలో మునిగి బాలిక మృతి
- విలపిస్తున్న తల్లిదండ్రులు

ఆడుతూ.. పాడుతూ తమ కళ్లెదుటే తిరుగాడే తమ గారాల పట్టి ఇక లేదనే వాస్తవాన్ని ఆ తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. తమ ఇంటి మహాలక్ష్మి మరలా రాని లోకాలకు వెళ్లిపోయిందనే చేదు నిజం వారి గుండెలను పిండేస్తోంది. మేనత్త సముద్రానికి వెళ్తుందని తెలిసి తల్లిదండ్రులకు తెలియకుండా స్నేహితులతో కలిసి సముద్రానికి వెళ్లిన సుంకు అక్షయ (12) అలల తాకిడికి బలైంది.

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు/పలాస

వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి శివసాగర్ బీచ్ సముద్రంలో ఆదివారం సాయంత్రం మునిగి ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి సుంకు అక్షయ (12) మృతి చెందగా, మరో విద్యార్థి చింతాడ రాజేశ్వరి అస్వస్థతకు గురైంది. స్థానికులు, వజ్రపుకొత్తూరు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాశీబుగ్గ మారుతీ నగర్ తాళాసు రంగారావు కోటర్స్‌లో సుంకు అర్జున్, కృష్ణవేణి నివాసం ఉంటున్నారు. సుంకు అక్షయ ఇంటి వద్ద ఆడుతున్న సమయంలో తన మేనత్త అక్కుపల్లి బీచ్‌కు వెళ్తున్నారని తెలిసి తన తల్లిదండ్రులకు చెప్పకుండా తన స్నేహితులతో కలిసి బీచ్‌కు వెళ్లింది. బీచ్‌లో అందరూ స్నానాలు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా వచ్చిన అలలు తాకిడికి సుంకు అక్షయ, చింతాడ రాజేశ్వరి సముద్రం లోపలికి కొట్టుకుపోయారు. వెంటనే స్థానికులు ఇద్దరినీ బయటకు తీసుకొచ్చారు. అయితే అప్పటికే అక్షయ మృతి చెందింది. రాజేశ్వరి అస్వస్థతకు గురికావడంతో వెంటనే పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మేఘన వైద్య సేవలు అందించారు. ప్రస్తుతం రాజేశ్వరి ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. అక్షయ సముద్రంలో మునిగి చనిపోయిందని విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకున్నారు. విగత జీవిగా ఉన్న అక్షయను చూసి తల్లిదండ్రులు నేలపై పడి కన్నీరుమున్నీరుగా విలపించిన దృశ్యం పలువురిని కంట తడి పెట్టించింది. అక్షయ కాశీబుగ్గ సాయికాలనీలో ఏడో తరగతి చదువుతుంది. మృతురాలి తల్లిదండ్రులు ఓ జీడి పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తున్నారు. మృతురాలికి అన్నయ్య ఉన్నారు. అక్షయ మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. వజ్రపుకొత్తూరు ఎస్ఐ మధుసూదనరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబు హామీలు బూటకం

పశుసంవర్థకశాఖ మంత్రి అప్పలరాజు

సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, రానున్న ఎన్నికల్లో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా వస్తే పథకాలన్నీ నిలిచిపోతాయని మత్స్య, పశు సంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పెసరపాడు, అంతరకుడ్డలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యాక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామ పురవీధుల్లో పర్యటించి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా? అడిగి తెలుసుకుని అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన బహిరంగసభలో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు హామీలన్నీ ఒక బూటకమని, ఎవరూ నమ్మి మోసపోగొద్దని హితవు పలికారు. సంక్రాంతి కానుకగా అవ్వా, తాతలకు జనవరి నెల నుంచి రూ.3 వేలు చొప్పున పింఛను ఇస్తామని చెప్పారు. రానున్న ఎన్నికల ముందే కాశిబుగ్గ రైల్వే వంతెన పూర్తి చేస్తామన్నారు. కెటి రోడ్డు విస్తరణ పనులు, కిడ్నీ ఆస్పత్రి, ఇంటింటికీ తాగునీరు, డిగ్రీ కళాశాల తన హయాంలో మంజూరయ్యాయని అన్నారు. త్వరలో పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. రూ.70 లక్షల వ్యయంతో పెసరపాడు, అంతరకుడ్డ రోడ్లు పూర్తి చేశామని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు హనుమంతు వెంకటరావు దొర, పలాస-మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, పలాస ఎఎంసి చైర్మన్ పి.వి.సతీష్, పలాస ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీర్ భవానీశంకర్, కమిషనర్ టి.నాగేంద్రబాబు, వైఎస్ చైర్మన్లు మీసాల సురేష్ బాబు, బోర కృష్ణారావు, కో-ఆప్షన్ సభ్యులు రోణంకి శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ

అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ అనురాధ

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ అనురాధ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రాణాంతక వ్యాధులైన మలేరియా, ఫైలేరియా, డెంగీ వంటి వ్యాధుల బారిన పడకుండా దోమల వ్యాప్తిని అరికట్టాలని అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ ఎన్.అనురాధ అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఆదివారం జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ముందుగా వద్ద సర్ రోనాల్డ్ రాస్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1897 ఆగస్టు 20న అంతర్జాతీయ స్థాయిలో దోమల నివారణ దినోత్సవంగా ప్రకటించారన్నారు. దోమల నుంచి మలేరియా వ్యాపిస్తోందని సర్ రోనాల్డ్ రాస్ కనుగొన్నారని గుర్తు చేశారు. జిల్లాలో దోమల వల్ల అనేక వ్యాధులు ప్రబలు తున్నాయని, వ్యాధులు ప్రాణాంతకంగా మారుతోందని అన్నారు. మలేరియా, ఫైలేరియా, డెంగీ వంటి ఎన్నో వ్యాధులకు దోమలే కారణమన్నారు. రసాయనాలతో కూడిన అనేక రకాల లిక్విడ్‌లు, క్వాయిల్స్ వంటివి మార్కెట్లో లభిస్తున్నాయని పేర్కొన్నారు. వీటిని ఉపయోగించడం వల్ల మరికొన్ని వ్యాధులు ప్రబలే ప్రమాదం లేకపోలేదన్నారు. అందువల్ల దోమలు వృద్ధి చెందకుండా ముందుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల నివారణకు వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అనేక చర్యలు చెపడుతున్నట్ల తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పి.వి. సత్యనారాయణ, ఎఎంఒ ఎస్.శ్రీనివాస్, డిసి శ్రీకాంత్, ఎస్‌యుఒ సూరి అప్పారావు, సామాజిక వేత్త మంత్రి వెంకటస్వామి, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీలకు కనీస వేతనం అమలు చేయాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు అమ్మన్నాయుడు

మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

ప్రజాశక్తి- కంచిలి

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, జిల్లా కార్యదర్శి సంగారు లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సోంపేట ప్రాజెక్టు మహాసభ కంచిలి మార్కెట్ యార్డులో ఆదివారం నిర్వహించారు. ఈ మహాసభలో వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు తెలంగాణా కన్నా అదనంగా వేతనాలు పెంచుతామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణలో రూ.13,500 వేతనం ఇస్తున్నారని అన్నారు. అంగన్వాడీలకు నాలుగేళ్ల క్రితం రూ.వెయ్యి జీతం పెంచారని అన్నారు. అంగన్వాడీలకు కనీసం డిఎ కూడా అమలు చేయడం లేదన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని అన్నారు. యాప్‌లు, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. గర్భిణులకు, బాలింతలకు టిహెచ్ఆర్ అమలకు కొత్తగా తీసుకొచ్చిన యాప్ వల్ల అంగన్వాడీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. 7 నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలకు ఎఫ్ఆర్ఎస్ యాప్ అమలు చేయాలనే ఆలోచన విరమించు కోవాలన్నారు. రకరకాల యాప్‌లు తెచ్చి పనిభారం పెంచారని, పర్యవేక్షణ పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. 2017 నుంచి టిఎ బిల్లులు చెల్లించడంలేదని తెలిపారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాసును ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల ఉద్యోగోన్నతి బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. అనంతరం సోంపేట ప్రాజెక్టు నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అంగన్వాడీ సోంపేట ప్రాజెక్టు కమిటీ గౌరవ అధ్యక్షులుగా వెదుళ్ళ హేమలత, అధ్యక్షులుగా డి.మోహిని, ప్రధాన కార్యదర్శిగా ఎన్.హైమవతి, కమిటీ సభ్యులుగా జి.శాంతి, సుధ, విజయలక్ష్మి, ఆర్.మోహిని, ప్రమీలను ఎన్నుకున్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో క్షయ నివారణ సంస్థలో ఏడాది కాలం పాటు కాంట్రాక్టు పద్ధతిలో పిపిఎం కో-ఆర్డినేటర్లుగా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, టిబి అధికారి డాక్టర్ ఎన్.అనూరాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ కేటగిరి జనరల్ అభ్యర్థులు ఈ నెల 21 నుంచి 28లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. బయోడేటాతో పాటు దరకాస్తు, నాలుగు నుంచి పదో తరగతి వరకు ధ్రువీకరణ పత్రాలు అందజేయాలన్నారు. రిమ్స్ ఆస్పత్రిలోని టిబి యూనిట్ రూమ్ నంబరు 24లో కార్యాలయ వేళల్లో అందజేయాలని సూచించారు. పూర్తి వివరాలకు శ్రీకాకుళం ప్రభుత్వ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

- మందకొడిగా ఖరీఫ్ సాగు
- వర్షాభావంతో ఆలస్యమవుతున్న నాట్లు
- వ్యవసాయ శాఖ జెడి కె.శ్రీధర్





ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రైతులు తాము పండించిన పంటలకు ఈ-క్రాప్ చేయించుకోవాలని వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్ తెలిపారు. దీనివల్ల ప్రభుత్వ రాయితీలు, పంట నష్టపరిహారం, పంట విక్రయం వంటి ప్రయోజనాలను రైతులు పొందుతారని చెప్పారు. ఈ ఏడాది ఈ-క్రాప్ బుకింగ్‌లో ప్రభుత్వం కొత్త మార్పు తీసుకొచ్చిందని తెలిపారు. గతంలో రైతు సాగు చేసిన పంటకు మాత్రమే ఫొటో అప్‌లోడ్ చేయగా, కొత్త విధానంలో పొలంలో రైతు ఉంటుండగా ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. వర్షాభావం కారణంగా ఖరీఫ్ సాగు మందకొడిగా ఉందన్నారు. పలు అంశాలను 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వెల్లడించారు.

ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ ఎలా సాగుతోంది?

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న ప్రతి పంటకు ఈ-క్రాప్ చేయించుకోవాలి. ఈ-క్రాప్ నమోదు కాకుంటే ప్రభుత్వ రాయితీలు పొందడానికి, పంటను అమ్ముకునేందుకు వీలు కాదు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి. వ్యవసాయశాఖ మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో గ్రామ సచివాలయాల్లో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ చేపడుతున్నాం.

పంట నమోదుకు జియోట్యాగింగ్ విధానం అమలు చేస్తున్నారా?

ఈ ఏడాది ఈ-క్రాప్ బుకింగ్‌లో ప్రభుత్వం కొత్త మార్పు తీసుకొచ్చింది. గతంలో రైతు సాగు చేసిన పంటకు మాత్రమే ఫొటో అప్‌లోడ్ చేయగా, కొత్త విధానంలో పొలంలో రైతు ఉంటుండగా ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పంటల కొనుగోలు, ఇతర ప్రయోజనాలన్నీ నిజంగా సాగు చేస్తున్న రైతులకే దక్కాలనే ప్రభుత్వం జియోట్యాగింగ్ విధానం తీసుకొచ్చింది. ఈ సంవత్సరం పంటతో పాటు పొలంలో రైతు ఉన్నట్లు ఫొటో తీసి జియోట్యాగింగ్ చేస్తున్నాం.

జిల్లాలో ఖరీఫ్ పనులు ఎలా సాగుతున్నాయి?

ఖరీఫ్ సీజన్ మొదలైన తర్వాత పూర్తిస్థాయిలో వర్షాలు కురవలేదు. గత నెలాఖరులో కురిసిన వర్షాల వల్ల సాగు అనుకూల పరిస్థితులు మెరుగయ్యాయి. ఆ తర్వాత వర్షాలు కురవకపోవడంతో నాట్లు వేయడం ఆలస్యమవుతోంది. వంశధార, నాగావళి నదీ పరివాహక మండలాలతో పాటు వాగులున్న చోట ఉబాలు ప్రారంభమయ్యాయి. ఈ నెలలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనాలు ఉన్నాయి. దీంఓ ఈ నెలాఖరుకు నాట్లు పూర్తయ్యే అవకాశముంది.

ప్రాజెక్టు ద్వారా సాగునీటి లభ్యత ఎలా ఉంది?

వంశధార కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటిని ఇప్పటికే విడుదల చేశారు. ఎడమ కాలువ ద్వారా నాలుగు వేల క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. దీనివల్ల కాలువ ఆయకట్టు పరిధిలో నాట్లు వేసుకునేందుకు వీలవుతోంది. అనేక ప్రాంతాల్లో ఇప్పటికే నాట్లు పూర్తయ్యాయి. నాగావళి నదిలో తోటపల్లి ఆయకట్టు, మడ్డువలస ఆయకట్టుకు, నారాయణపురం కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు నీటిని విడుదల చేయడం వల్ల ఆయా ప్రాంతాల్లో వ్యవసాయ పనులు సాగుతున్నాయి.

శివారు, వర్షాధార భూముల్లో నాట్లు వేసుకునేందుకు సాగునీరు అందని పరిస్థితి ఉంది. ఆ ప్రాంతాల్లో నాట్లు కొంత ఆలస్యమవుతున్నాయి. నీరు అందుబాటులోకి వస్తే ఆ ప్రాంతాల్లోనూ వ్యవసాయ పనులు ఊపందుకుంటాయి.

రైతుభరోసా కేంద్రాల్లో ఎరువులు ఎంతమేరకు సిద్ధం చేశారు?

జిల్లాలో ఈ ఏడాది 10,063 మెట్రిక్ టన్నుల యూరియా, 2,999 మెట్రిక్ టన్నుల డిఎపి, 1835 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 398 మెట్రిక్ టన్నుల సూపర్ ఫాస్పేట్, 950 మెట్రిక్ టన్నుల పొటాష్ సిద్ధంగా ఉన్నాయి. డీలర్ల వద్ద అదనంగా 16,245 మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. నానో యూరియా 1,554 లీటర్లు రైతుభరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంది.

అన్ని మండలాల్లో ప్రస్తుతం ఎరువులు అందుబాటులో ఉన్నాయి. రైతు భరోసా కేంద్రాలతో పాటు ప్రాథమిక సహకార సంఘాలు, వ్యవసాయ మార్కెటింగ్ శాఖల పరిధిలో ఎరువులను అందుబాటులో ఉంచాం.

రైతులకు సాంకేతిక పరికరాలు అందుబాటులో ఉన్నాయా?

జిల్లాలోని వ్యవసాయ, అనుబంధ సంస్థల రైతులకు సాంకేతిక పరిజ్ఞానంతో రైతులకు మరింత లబ్ధి చేకూర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. తక్కువ ఖర్చుతో పంటలను సాగు చేసుకునేందుకు యాంత్రీకరణ అవసరం. వరినాట్లు యంత్రంతో ఉడుపు, రోటరీ ఫీడరుతో గాబుతీత, డ్రోన్లతో పురుగులు, తెగుళ్ల మందులు పిచికారీ, కంబైన్డ్ హార్వెస్టర్‌తో వరి కోతలు వంటి ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. వాటిని వినియోగించుకుంటే ఉత్పత్తి వ్యయం తగ్గుతుంది. వరి వంగడాలతో పాటు జొన్న, రాగి, కంది, మినుము, పెసర, చెరకు , ఇతర వాణిజ్య పంటలను వేసుకోవడం ద్వారా రైతుకు మేలు చేకూరుతుంది. ఆదాయం పెరుగుతుంది.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

అగ్నికుల క్షత్రియులకు అండ

ప్రజాశక్తి- కవిటి

అగ్నికుల క్షత్రియులకు అండగా ఉంటామని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్ అన్నారు. జెడ్‌పి నిధులు రూ.5 లక్షలతో కవిటిలో నూతనంగా నిర్మించనున్న అగ్నికుల క్షత్రియ సంఘం సామాజిక భవనం నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడేవి, అవసరమైనవి తెలుసుకుని కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. క్షత్రియ సంఘానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, భవిష్యత్‌లో మరింత ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు లోళ్ల రాజేష్, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు, వైస్ ఎంపిపి పూడి నేతాజీ, ఎఎంసి వైస్‌చైర్మన్ యలమంచి నీలయ్య, ఎంపిటిసిలు పూడి నీలాచలం, మానేక శంకర్ ప్రధాన్, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న న్యాయవాదులు

చట్టంతోనే న్యాయవాదులకు రక్షణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకొచ్చి వారిపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) 12వ రాష్ట్ర మహాసభలో తీర్మానించామని ఐలూ రాష్ట్ర కమిటీ సభ్యుడు బొడ్డేపల్లి మోహనరావు తెలిపారు. ఈ మేరకు ఆమదాలవలస బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి సారథ్యంలో ఆదివారం జరిగిన న్యాయవాదుల డిమాండ్స్‌ను నెరవేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకంలో సామాజిక న్యాయం పాటించాలన్నారు. దక్షిణాదిలో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. కోర్టుల్లో మహిళా న్యాయవాదులకు, కక్షిదారులకు కనీస సౌకర్యాలు కల్పించాలని అన్నారు. న్యాయవాదుల సంక్షేమ నిధిని ప్రభుత్వం విడుదల చేయాలని జూనియర్ లాయర్లకు స్టైఫండ్ క్రమం తప్పకుండా అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు హనుమంతు ప్రసాదరావు, బి.సీతారాం, గురుగుబెల్లి ప్రభాకరరావు, రాజేశ్వరరావు, తమ్మినేని అన్నంనాయుడు, కె.త్రినాథరావు పాల్గొన్నారు.

శ్మశాన స్థలంపై రగడ

- ఆట స్థలం కోసం నీలావతి యువకుల చదును
- కబ్జా చేస్తున్నారని మాకన్నపల్లి గ్రామస్తుల ఆరోపణ
- రీ సర్వేలో శ్మశాన వాటికగా రెవెన్యూ అధికారుల గుర్తింపు

చదును చేసిన శ్మశాన స్థలం

ప్రజాశక్తి- పలాస

తొమ్మిది గ్రామాలకు చెందిన శ్మశాన వాటిక స్థలంపై రగడ జరుగుతోంది. ఒక గ్రామం శ్మశాన వాటిక స్థలం కబ్జాకు గురైందని ఆరోపిస్తే... మరో గ్రామం ఆట స్థలం కోసం చదును చేస్తున్నామని చెప్పడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు జోరుగా వినిపిస్తుంది.

మండలంలోని నీలావతి రెవెన్యూ పరిధి మాకన్నపల్లికి సమీపంలో ఉన్న వారడొంకలు ప్రాంతంలో సర్వే నంబరు 213/2 లో 2.40 ఎకరాలు శ్మశాన స్థలం ఉంది. పూర్వం నుంచి మాకన్నపల్లి, చిన్నమాకన్నపల్లి, మాలమాకన్నపల్లి, గొల్లమాకన్నపల్లి, నీలావతి, చిన్ననీలావతి, కొబ్బరి చెట్లూరు, కొత్తవారు, డొక్కరిపేట గ్రామాల ప్రజలెవరైనా చనిపోతే ఇక్కడే దహన సంస్కారాలు నిర్వహించేవారు. శ్మశాన స్థలాన్ని ఏ ఇతర అవసరాలకు వినియోగించ కూడదని నిబంధన ఉంది. అయితే చిన్న నీలావతికి చెందిన కొంత మంది వ్యక్తులు భారీ యంత్రాలతో చదును చేశారు. దీనిపై ఇతర గ్రామస్తులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తొమ్మిది గ్రామాలకు చెందిన గ్రామ పెద్దలకు, పంచాయతీలకు సమాచారం లేకుండా శ్మశాన స్థలం చదును చేయడంతో రెండు రోజులుగా రగడ జరుగుతోంది. పంచాయతీల తీర్మానం లేకుండా, సర్పంచ్‌లు అనుమతి లేకుండా ఇష్టానుసారంగా ఏలా చదును చేస్తారని ప్రశ్నించారు. చిన్న నీలావతికి చెందిన తెప్పల ఆనందరావు, గొరకల లోకేశ్వరరావు, పుచ్చ బాబూరావు శ్మశాన స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, తీరా చూస్తే శ్మశాన వాటికలో ఆట స్థలం కోసం చెబుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఇటీవల నీలావతి పంచాయతీలో గడపగడపకు వైసిపి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజుకు చిన్న నీలావతికి చెందిన కొంత మంది యువకులు గ్రామానికి ఆట స్థలం కేటాయించాలని కోరారు. అందుకు మంత్రి సరే అనడం వల్లే రెండు గ్రామాల మధ్య శ్మశాన స్థలంపై రగడ జరుగుతోందని విస్తృతంగా ప్రచారం జరుగుతోంది.

ఏలా చదును చేస్తారు

మాకన్నపల్లికి సమీపంలో ఉన్న వారడొంకలు ప్రాంతంలోని శ్మశాన స్థలాన్ని ఏలా చదును చేస్తారని మాకన్నపల్లి సర్పంచ్ సైని దేసయ్య, మాజీ సర్పంచ్ తెప్పల అప్పలస్వామి ప్రశ్నించారు. చదును చేసిన స్థలాన్ని గ్రామస్తులతో పాటు వారు ఆదివారం పరిశీలించారు. తొమ్మిది గ్రామాలకు చెందిన ప్రజలకు సంబంధించిన శ్మశాన వాటికలో ఆటస్థలం ఎలా నిర్మిస్తారంటూ ప్రశ్నించారు. తొమ్మిది గ్రామాలకు చెందిన పెద్దలతో సంప్రదింపులు చేయకుండా ఇష్టానుసారంగా చిన్న నీలావతికి చెందిన తెప్పల ఆనందరావు, గొరకల లోకేశ్వరరావు, పుచ్చ బాబూరావు భారీ యంత్రాలతో చదును చేయడమే కాకుండా జిరాయితీ పొలాలు సైతం కప్పి వేస్తున్నారని ఆరోపించారు. శ్మశాన స్థలం ఆ ఒక్క గ్రామానికి చెందినది కాదని, చదును చేయడం ఆపమని చెబుతున్నా వినిపించుకోకపోవడం సరికాదన్నారు. దీనిపై సంబంధిత అధికారులు చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని కోరారు. వారితో పాటు రాపాక పురుషోత్తం, కోరాడ ధనరాజు, కుత్తం ధర్మారావు, దాసరి దానేష్, తెప్పల అజయ్ కుమార్, గేదెల నీలకంఠం, బి.వీరాస్వామి, సాలిన కోదండరావు, బోకర విశ్వనాథం ఉన్నారు.

రూ.పది లక్షలు వృథా

మాకన్నపల్లి, నీలావతి పంచాయతీల పరిధిలో తొమ్మిది గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రలెవరైనా చనిపోతే అంత్యక్రియలు నిర్వహించడం, చిన్న పిల్లలను కననం చేసేవారు. 12 ఏళ్ల క్రితం నీలావతి, మాకన్నపల్లి పంచాయతీ ప్రజలు అనుమతితో శ్మశాన స్థలంలో కొంత భాగంలో చెరువు తవ్వారు. ఆ చెరువుకు ఆనుకొని సుమారు 50 ఎకరాలు పైబడి వ్యవసాయ భూములకు సాగునీరు అందుతోంది. అటు రైతులకు, ఇటు చెరువు అభివృద్ధికి ఈ ఏడాది ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలు వెచ్చించి పనులు చేపట్టారు. చెరువు చుట్టూ ఉన్న చెరువు గట్టును సుందరంగా తీర్చిదిద్దారు. అయితే శ్మశాన స్థలంతో పాటు చెరువు గట్టును భారీ యంత్రాలతో ధ్వంసం చేశారు. దీంతో ఉపాధి హామీ నిధులు వృథా అయ్యారు. వచ్చే డిసెంబరు నెలలో సోషల్ ఆడిట్ ఉందని, ఇబ్బందులు వస్తాయని చెబుతున్నా పట్టించుకోకుండా చెరువు గట్టును తొలగించడంపై కూలీలు, అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంతా జరుగుతున్నా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుకోక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై తహశీల్దార్ ఎల్.మధుసూదనరావును వివరణ కోరగా, శ్మశాన స్థలంలో ఆట స్థలం కోసం తాము అనుమతి ఇవ్వలేదన్నారు. శ్మశాన స్థలం అభివృద్ధి చేస్తామని చెబితే సరే అన్నమే తప్ప... ఆట స్థలం కోసం అయితే ఇవ్వడం కుదరదని స్పష్టం చేశారు.

పరిమళించిన మానవత్వం

- దాతల నుంచి అనూహ్య స్పందన
- ఆరు రోజుల్లో రూ.12 లక్షలు అందజేత

ఆర్థిక సాయం అందిస్తున్న చిరంజీవి స్నేహితులు

ప్రజాశక్తి- కవిటి

మానవత్వం పరిమళించింది. అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి ఆద్య కోసం దాతలు అనూహ్యంగా స్పందిస్తున్నారు. ఆద్య తండ్రి చిరంజీవితో కలిసి 2005-06లో పదో తరగతి చదివిన స్నేహితులు తమ వంతుగా రూ.78,801లను అప్పటి తమ ఉపాధ్యాయుడు పండి బలరామమూర్తి, వ్యాపారవేత్త పాండవ రామారావు చేతులు మీదుగా చిరంజీవి తండ్రి తులసయ్యకు అందించారు. అదే విధంగా ప్రగడపుట్టుగకు చెందిన ముత్యాల కావ్య తన స్నేహితులతో కలిసి సేకరించిన రూ.40 వేలు, పాండవ రామారావు రూ.21 వేలు, ఎస్జిఎఫ్ స్వచ్ఛంద సంస్థ రూ.26 వేలు, కేశుపురానికి చెందిన శ్రీకాళీమాత సేవా సమితి రూ.25 వేలు, ఎన్ఆర్ఐ శిరీష రూ.20 వేలు, అన్నవరం హెల్పింగ్ హేండ్స్ రూ.15 వేలు, జైహింద్ ఫౌండేషన్ రూ.10 వేలు, పలాసకు చెందిన పవనపుత్ర సేవా సంస్థ రూ.10 వేలు, కపాసుకుద్దికి చెందిన రాధకృష్ణ సంఘం రూ.5 వేలు, ఈదుపురానికి చెందిన చిరంజీవి స్నేహితులు రూ.5 వేలు, బాలాజీపుట్టుగకు చెందిన బెందాలం శ్రీపతి రూ.5 వేలు, ఎస్‌సిఎం ట్యూషన్ సెంటర్ చెందిన వారు రూ.3,250 పాప చికిత్స కోసం అందించారు. ఇప్పటి వరకూ పాప చికిత్స కోసం దాతల నుంచి తనకు రూ.12 లక్షలు అందాయని, స్పందించిన ప్రతి హృదయానిరీ పాదాభి వందనాలని పాప తండ్రి చిరంజీవి తెలిపాడు.

రోడ్డు నిర్వాసిత రైతుల అసహనం

టెక్కలి: టెక్కలి జాతీయరహదారి నుంచి మూలపేట వరకు పోర్టు వ్యవహారాల కోసం నూతనంగా రోడ్డు నిర్మాణ విషయంలో అధికార పార్టీ ముఖ్య నాయకులు అనుసరిసు_న్న వ్యవహారశైలిపై బన్నువాడ, మోదుగువలస గ్రామాలకు చెందిన రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పోర్టు నిర్మాణం నేపథ్యంలో సరుకులు రవాణా కోసం మూలపేట నుంచి టెక్కలి జాతీయ రహదారి వరకు ప్రయివేట్ రోడ్డు నిర్మాణానికి సర్వే చేపట్టారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా పిఠాపురం వద్ద రోడ్డు రెండు దారులుగా విడదీయనున్నారు. ఈ నేపథ్యంలో బన్నువాడ, పిఠాపురం, మోదుగువలస, రఘునాథపురం గ్రామాలకు చెందిన పంట పొలాలు రోడ్డు నిర్మాణం దృష్ట్యా కనుమరుగు కానున్నాయి. రోడ్డు నిర్మాణానికి సర్వే జరిగిన క్రమంలో కొన్ని గ్రామాలకు చెందిన రైతులతో రెవెన్యూ అధికారులు చేపట్టిన చర్చలు విజయవంతమయ్యాయి. వారు తమ పంట పొలాలు పోర్టు రోడ్డు నిర్మాణానికి ఇవ్వడం వంటివి జరిగాయి. అయితే బన్నువాడ, మోదుగువలస, పిఠాపురం గ్రామాలకు చెందిన రైతులు మాత్రం తమ పంట పొలాలు రోడ్డు నిర్మాణం దృష్ట్యా ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేయలేదు. దీనిపై పలుమార్లు పూర్వ సబ్‌కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డితో రైతులు చర్చించారు. పంట పొలాలకు పరిహారం చెల్లింపులో వివక్ష చూపుతున్నారని, నష్టపరిహారం చెల్లింపులో వివాదాల నేపథ్యంలో రైతులు తమ భూములు ఇచ్చేందుకు అంగీకారం తెలియజేయలేదు. దీనికి తోడు పోర్టు రోడ్డు నిర్మాణం జరగనున్న క్రమంలో తమ ప్రాంత పంట పొలాలు ముంపుకు గురయ్యే అవకాశాలున్నాయని రైతులు స్పష్టం చేశారు. అయినా, అధికారులు వ్యవహారశైలి రైతులకు మింగుడుపడడం లేదు. సరికదా తాజాగా నియోజకవర్గ ముఖ్య నేత అతి తక్కువ పంట పొలం కలిగిన ఒకరిద్దరు రైతులను వెంట వేసుకుని నష్టపరిహారం విషయంలో కలెక్టర్‌ను కలిశారని రైతులు ఆరోపిస్తున్నారు. 70 మంది రైతులకు చెందిన 120 ఎకరాల ఎకరాల పంట పొలాలు నాశనం అవుతుంటే... కేవలం మూడు ఎకరాల పంట పొలాలు నష్టానికి గురైన రైతులను తీసుకొని వెళ్లి మాట్లాడడం ఎంత వరకు సమంజసమని సోషల్ మీడియాను వేదికగా చేసుకుని రైతులు ప్రశ్నిస్తున్నారు.

అందుబాటులోకి ఆధునిక వైద్యం

ఆస్పత్రిని ప్రారంభిస్తున్న కృపారాణి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

డాక్టర్ పైల లక్ష్మీనారాయణ సూపర్‌స్పెషాలటీలో రోగులకు ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం ఆనందదాయకమని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌లు అన్నారు. నగరంలోని డేఅండ్‌నైట్ కూడలిలో నిర్మించిన డాక్టర్ లక్ష్మీనారాయణ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి న్యూరో, డెంటల్ కేర్ సెంటర్‌ను వారు ఆదివారం ప్రారంభించారు. అధునాతన సౌకర్యాలతో ఆస్పత్రి ప్రారంభం కావడం అభినందనీయమని అన్నారు. దూర ప్రాంతాలకు న్యూరో వైద్యం కోసం వెళ్లనవసరం లేకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయడం మంచి పరిణామన్నారు. హైదరాబాద్ నిమ్స్‌లో న్యూరో వైద్యనిపుణుడుగా పేరుతెచ్చుకున్న డాక్టర్ లక్ష్మీనారాయణ జిల్లా ప్రజలకు మరింత సేవచేయగలరని అన్నారు. మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఉత్తమ వైద్యుడిగా రాష్ట్రస్థాయిలో పలుమార్లు వైద్యనిపుణులుగా అవార్డులు అందు కున్న వ్యక్తి లక్ష్మీనారాయణ అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, పోలాకి జెడ్‌పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య, వైద్యులు కొంచాడ సోమేశ్వర రావు, దానేటి శ్రీధర్, గూడేన సోమేశ్వరరావు, మందుల మోహనరావు, బొడ్డేపల్లి సురేష్, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర నాయకులు కొంక్యాన వేణుగోపాల్, ఆస్పత్రి అధినేతలు, న్యూరో సర్జన్ డాక్టర్ పైల లక్ష్మీనారాయణ, డెంటల్ సర్జన్ డాక్టర్ పేడాడ ఇందిర పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కృషి చేస్తామని ఎచ్చెర్ల నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కొత్తకోట్ల సింహాద్రినాయుడు అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా మండల కేంద్రం పార్టీ కార్యాలయంలో ఆదివారం రాజీవ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని అన్నారు. టెలీ కమ్యూనికేషన్, శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశం, జాతి ఐక్యత కోసం పాటుపడ్డారని అన్నారు. తక్కువ సమయంలో

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

ప్రధానిగా బాధ్యతలు చేపట్టి భారత దేశానికి, భవిష్యత్ తరాలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ కె.లక్ష్మి, కె.జోగినాయుడు, మీసాల గణేష్, రమణ, వై.సూర్యనారాయణ పాల్గొన్నారు.

వైసిపి పాలనలో మహిళలకు అన్యాయం

కోటబొమ్మాళి : పోస్టర్‌ను అందజేస్తున్న శైలజ

ప్రజాశక్తి- లావేరు

వైసిపి పాలనలో మహిళలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి ముప్పిడి సుజాత అన్నారు. మండలంలోని పెదరావుపల్లి పంచాయతీ బయ్యన్నపేటలో ఆదివారం టిడిపి మహాశక్తి కార్యక్రమంలో భాగంగా చైతన్యయాత్రలో పాల్గొన్నారు ముందుగా పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి టిడిపి మినీ మేనిఫెస్టోను వివరిస్తూ... పోస్టర్లను అందజేశారు. స్వయం శక్తి సంఘాలను పెట్టి మహిళలకు సమాజంలో గుర్తింపు గౌరవాన్ని వెచ్చింది చంద్రబాబేనని అన్నారు. కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి గంట సంధ్య, పెదరావుపల్లి సర్పంచ్ కొన్ని హేమసుందరరావు, నాయకులు కె.రమణ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి అని టెక్కలి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పూజారి శైలజ అన్నారు. మండలంలోని పట్టుపురంలో ఆదివారం భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి టిడిపి మినీ మేనిఫెస్టోను వివరించారు. రాష్ట్రంలో వైసిపి చేస్తున్న ఆరాచకాల గురించి ప్రజలకు తెలియజేశామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, టిడిపి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దేవాది సింహాద్రమ్మ, బెండి అన్నపూర్ణ, వాన లక్ష్మి, మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, గొండు లక్ష్మణరావు, శిమ్మ నారాయణరావు, పల్లి రాంబాబు, బాడాన రమణమ్మ, కోరాడ గోవిందరావు పాల్గొన్నారు.


లావేరు : పోస్టర్‌ను అందజేస్తున్న సుజాత

వ్యాసరచన పోటీలతో మేధాశక్తి

గెలుపొందిన విద్యార్థులతో యువివి సభ్యులు

ప్రజాశక్తి- పలాస

వ్యాసరచన పోటీల ద్వారా విద్యార్థుల్లో మేధాశక్తి పెరుగుతుందని పలాస శాఖాగ్రంథాలయ సంచాలకులు రాంబాబు అన్నారు. మండలంలోని నీలావతిలో ఉద్దాన విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యాన యువివి గ్రంథాలయం ప్రథమ వార్షికోత్సవం వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ వ్యక్తిత్వ, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహిస్తే విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. గ్రంథాలయాల్లో అనేక రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయని, వాటిని పఠనం చేస్తే భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో అతిపెద్ద గ్రంథాలయం ఏర్పాటు చేసి విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా అవకాశం కల్పించిన ఉద్దానం విద్యాభివృద్ధి వేదిక నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు.

అనంతరం 65 మంది విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారు. 6,7 తరగతులకు జరిగిన జూనియర్ విభాగంలో డి.అస్మిత, టి.నవసాహిత్, పి.చిరంజీవి, జాష్ణవి ,హిందూలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 8,9,10వ తరగతులకు జరిగిన సీనియర్ విభాగంలో బి.లాస్య, ఎస్.జ్యోష్ణ, జె.హిందూ, కె.అమృత, కె.హాసిని ప్రథమ, ద్వితీయ, తృతీయ ప్రోత్సాహక బహుమతులకు ఎంపికయ్యారు. వారికి బహుమతులు, షీల్డ్ ప్రదానం చేశారు. స్థానిక లైబ్రేరియన్‌గా సేవలు అందిస్తున్న గీతాంజలిని కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఇసాకోటి జోగారావు, కార్యదర్శి బొడ్డు చిన్నారావు, గ్రంథాలయ నిర్మాణ కమిటీ కుత్తుం ప్రకాశరావు, గ్రంథాలయ నిర్వహణ కమిటీ కన్వీనర్ పాలిన కృష్ణారావు, ఉపాధ్యక్షులు పి.గీతమ్మ, ఆర్థిక కార్యదర్శి యంపళ్ల కామేష్, అకడమిక్ సెల్ కన్వీనర్ పోతనపల్లి బాలరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వివిఎన్ మాస్టారు

గద్దర్ పాటలు చిరస్మరణీయం

ఆమదాలవలస : ప్రజా యుద్ధ నౌక గద్దర్ చిరస్మరణీయుడని, తెలుగు సాహిత్యం ఉన్నంతవరకు అతని పాట సజీవంగా ఉంటుందని విశ్వ సాహితీ అధ్యక్షులు పి.వి.ఎన్.మాస్టర్ అన్నారు. పట్టణంలోని బి.ఆర్.నగర్ విశ్వ సాహితీ కార్యాలయంలో గద్దర్ సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ముందుగా గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. కవి బగాది వెంకటరావు మాట్లాడుతూ విప్లవ ఉద్యమంలో గద్దర్ లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. అతని పాటలు ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. తమ్మినేని సీతారామాచార్యులు, ఉపాధ్యాయుడు, రచయిత పూజారి సూర్యనారాయణ, రచయితలు కుప్పిలి చంద్రమౌళి, కె.వి.రాజారావు, గురుగుబెల్లి కృష్ణారావు, నాయనపాత్రుని చంద్రశేఖరరావు, వాసుదేవరావు, మెట్ట తేజేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ముద్దు

ఆమదాలవలస : ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలను చాలా సులువుగా పండించుకోవచ్చని, ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల సాగుకయ్యే పెట్టుబడులు చాలా తగ్గుతాయని ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ నక్క చిరంజీవి తెలిపారు. మండలంలోని చేపేనపేటలో పదెకరాల విస్తీర్ణంలో వరి పంటలో జిగురు పూసిన పసుపు అట్టలను పెట్టారు. పంటలో వీటిని పెట్టుకోవడం వల్ల పంటను ఆశించే పచ్చ దోమ, ఇతర చిన్నచిన్న పురుగులు నివారణ అవుతాయని తెలిపారు.

విద్యార్థులు 'ఎన్ఎసిఎల్' సందర్శన

పరిశీలిస్తున్న 'ఐతమ్' విద్యార్థులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఎంబిఎ విద్యార్థులు శ్రీకాకుళం చిలకపాలెం సమీపంలో ఉన్న నాగార్జున అగ్రోకెమికల్ లిమిటెడ్ (ఎన్ఎసిఎల్) కంపెనీని ఆదివారం సందర్శించినట్టు డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. పరిశ్రమ స్థాపన, నిర్వహణ, వాణిజ్య, వ్యాపార రంగాల్లో ఉన్న ఒడిదుడుకులు, బ్యాంకు రుణాలు, కార్మికుల ఆరోగ్య ఇతర భద్రతా చర్యలు వంటి విషయాలను అధికారులతో సంప్రదించి విద్యార్థులు తెలుసుకున్నారని అన్నారు. కార్మికుల సమస్యలను, కంపెనీ తీసుకుంటున్న సంక్షేమ చర్యలు వంటి అంశాలను కార్మికులతో మాట్లాడారని తెలిపారు. తరగతి గదుల్లో నేర్చుకున్న విషయాలు క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు విద్యార్థులకు ఈ పరిశ్రమ సందర్శన చక్కటి అవకాశమని చెప్పారు. విద్యార్థులతో పాటు అధ్యాపకులు డి.ప్రణయ, వి.గోపాలకృష్ణలు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఎంబిఎ హెచ్‌బిడి డాక్టర్ బి.శివకుమార్ ఈ పర్యటనను పర్యవేక్షించారు.

కంప్యూటర్ వితరణ

కంప్యూటర్‌ను ప్రారంభిస్తున్న షణ్ముఖరావు

ప్రజాశక్తి- రణస్థలం

మండల కేంద్రంలో సేవా ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఉచిత గ్రంథాలయానికి విశ్రాంత ఉద్యోగి ఆదివారం కంప్యూటర్‌ను వితరణగా అందజేశారు. 2007-2011 వరకు రణస్థలం ఆంధ్రాబ్యాంకులో మేనేజర్‌గా జినగాం షణ్ముఖరావు పనిచేశారు. ఇటీవల ఉద్యోగోన్నతి పొంది విశాకపట్నంలో స్థిరపడ్డాడు. షణ్ముఖరావు అన్న శంకరరావు జ్ఞాపకార్థం ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం ఒక కంప్యూటర్‌ను వితరణగా అందజేశారు. గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగాల్లో స్థిరపడాలన్నారు. అనంతరం ఫౌండేషన్ సభ్యులు షణ్ముఖరావుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సేవా ఫౌండేషన్ అధ్యక్షులు తిరుపతిరాజు, స్థానిక స్టేట్ బ్యాంకు క్యాషియర్ దేశెట్టి హరిప్రసాద్, మింద్రాణ రామారావు, తాజ్ మోఉద్దీన్, ముల్లు రాంబాబు, పసుపురెడ్డి సురేష్, కొమ్మోజు ఉమ, గెడ్డపు వరం, ఖండవిల్లి వెంకి, బలివాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆలయ ప్రహరీ తొలగింపు

చదును చేసిన అధికార పార్టీ నాయకులు

లావేరు : మండలంలోని మురపాక పంచాయతీ పి.బి.నగర్ కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రహరీని వైసిపి నాయకులు శనివారం సాయంత్రం ప్రొక్లెయినర్‌తో తొలగించి చదును చేయించారు. దీనిని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం పరిశీలించారు. కాలనీలో 1983లో సోషల్ వెల్ఫేర్ ఆధ్వర్యాన ఆలయాన్ని నిర్మించి దేవాదాయశాఖకు స్థలాన్ని అప్పగించారు. అయితే ఆలయం వెనుక ఉన్న ఓ కాలనీకి రహదారి నిర్మాణం చేపట్టేందుకు వైసిపి నాయకులు ఆలయ కమిటీకి తెలియజేయకుండా ప్రహరీ తొలగించారని సభ్యులు తెలిపారు. 40 ఏళ్లుగా ఉన్న ఆలయ భూముల్లో నుంచి ప్రస్తుతం రహదారి నిర్మాణం చేపట్టడం ఏమిటని కమిటీ సభ్యులు ప్రశ్నించారు. అదేవిధంగా కాలనీకి వెళ్లేందుకు రోడ్డు నిర్మించాలని ఇటీవల తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రోడ్డు నిర్మాణానికి అనుమతులు కావాలని కాలనీ వాసులు పంచాయతీ దరఖాస్తు చేసుకుంటే అనుమతులు ఇచ్చామని, ఆలయానికి ప్రహరీ తొలగించడం తనకు తెలియదని మురపాక సర్పంచ్ నాగమణి తెలిపారు. అలాగే తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి మాట్లాడుతూ దేవాదాయశాఖ స్వాధీనంలో భూములు, ఆలయ ప్రాంగణంలో నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు అనుమతులు ఇవ్వమని స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : ఆమదాలవలస-శ్రీకాకుళం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రాగోలు పరిసర ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ స్తంభాలు, తీగలు మారుస్తున్నామని అన్నారు. రాగోలు విద్యుత్ సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయనున్నామని అన్నారు. అందుకు సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆమదాలవలస రూరల్ సెక్షన్ పరిధి, రాగోలు సబ్ స్టేషన్ పరిధిలోని కొత్త రోడ్డు, గోపీనగరం, తోటాడ, అక్కివరం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

'అన్ని పార్టీలోనూ రెడ్డిలు ఉన్నారు'

ఇచ్ఛాపురం : అన్ని పార్టీలోనూ రెడ్డికి సామజిక తరగతికి చెందిన వారు ఉన్నారని, ఒక్క వైసిపిలోనే ఉన్నట్లు ప్రకటన చేయడం హాస్యాస్పదంగా ఉందని బుద్దాల నిర్మలారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల పది మంది నేతలతో ఫొటో దిగి తమ సామజిక తరగతి చెందిన వారు వైసిపి వెంటే ఉన్నామని చెప్పడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. 130 గ్రామాల్లోని రెడ్డి సామాజిక తరగతి చెందిన వారిలో సమావేసపర్చి వారి అభిప్రాయములు సేకరణ చేశారా? అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో 70 వేల మంది ఓటరు ఉంటే... వైసిపికి ఎందుకు టిక్కెట్ ఇవ్వలేదని ప్రశ్నించారు. కార్పొరేషన్ చైర్మన్ పదవి చేపట్టి నాలుగేళ్లు అవుతున్నా ఒక్క కుటుంబానికైనా మేలుచేకూరిందా? అని ప్రశ్నించారు. ఈయన వెంట జనసేన నాయకులు తిప్పన దుర్యోధనరెడ్డి, విశ్వనాథం రెడ్డి, ఆసీ సత్యంరెడ్డి, రాముమూర్తి రెడ్డీ, హరికృష్ణారెడ్డి, యశోదరెడ్డి ఉన్నారు.

మాట్లాడుతున్న చిరంజీవి నాగ్

ఉప ఎన్నిక గీటురాయి

ఆమదాలవలస: రాష్ట్రంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో వైసిపి అత్యధిక స్థానాల్లో గెలుపొందిందని వైసిపి పాలనకు గీటురాయని వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ అన్నారు. పట్టణం లోని తన నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పాలనకు, అభివృద్ధికి ప్రజలు బాసటగా నిలిచారని అన్నారు. ఎన్నికలు ఏవైనా వైసిపికే ప్రజా మద్దతుకు తిరుగులేదని మరోసారి నిరూపించారని అన్నారు. సరుబుజ్జిలి మండల పార్టీ అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, గురుగుబెల్లి నీలారావు, నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

28 ద్విచక్ర వాహనాల సీజ్

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో త్రిబుల్ రైడింగ్, హెల్మెట్ పెట్టుకొని వాహనాలను గుర్తించి 28 ద్విచక్ర వాహనాలను ఆదివారం సీజ్ చేశామని కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్రిబుల్ రైడింగ్ చేస్తే మొదటిసారిగా అపరాధ రుసుం వసూలు చేస్తామని, రెండోసారి పట్టుపడితే సీజ్ చేసి కోర్టుకు అప్పగిస్తామని తెలిపారు. ట్రాఫిక్‌పై ప్రత్యేక కార్యాచరణలో భాగంగా త్రిబుల్ రైడింగ్ వాహనాలను పట్టుకున్నామని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

గ్రంథాలయాల్లో 'చదవడం మాకిష్టం'

రణస్థలం రూరల్ : విద్యార్థులతో చదివిస్తున్న వరలక్ష్మి

లావేరు : లావేరు శాఖాగ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ ఉద్యమకర్త పాతూరి నాగభూషణం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలిత ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాగభూషణం గ్రంథాలయ ఉద్యమ కర్తగా, వయోజన విద్య నడిపించి, బోటు గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని అందరికీఅందించారని అన్నారు. అలాగే చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. బాగా చదివిన ముగ్గురు విద్యార్థులకు గ్రంథాలయ తరుపున బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: గ్రంథాలయాలు చదువులకు నిలయాలని గ్రంథాలయాధికారి పి.వరలక్ష్మి అన్నారు. మండల కేంద్రం శాఖాగ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా దినపత్రికల పఠనం, కథలు, జాతి నాయకుల జీవిత చరిత్రను చదివించారు. విద్యార్థి దశ నుంచే పుస్తకాన్ని అలవాటు చేసుకోవాలని, తద్వారా భవిష్యత్‌లో మీరు అనుకున్న గమ్యాన్ని చేరుకోగలుగుతారని విద్యార్థులకు సూచించారు. అచ్చులతో, హల్లులతో కూడిన ఆటల పోటీను నిర్వహించారు.

అరసవల్లి సన్నిధిలో విశాఖ కలెక్టర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రావణ మాసం ఆదివారం కావడంతో అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి రద్దీ పెరిగింది. పలువురు ప్రముఖులు సందర్శించారు. విశాఖ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున్ కుటుంబ సభ్యులతో కలిసి అరసవల్లి సందర్శించారు. అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి పూర్వ ఛైర్మన్ అదపాక సత్యారావు దంపతులు, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు లావేటి వేణుగోపాలనాయుడు తదితరులు అరసవల్లి సందర్శించారు. వారికి ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, రంజిత్ శర్మల ఆధ్వర్యాన ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతించారు. స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో వారికి శేషవస్త్రాలను కప్పి చిత్రపటాలను అందజేశారు.



ప్రారంభానికి సిద్ధమైన పిహెచ్‌సి

రేపు వెంకటాపురం పిహెచ్‌సి ప్రారంభం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని వెంకటాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైందని సర్పంచ్ కాటకాన మల్లేశ్వరరావు, ఎంపిటిసి ఉరిటి కామేశ్వరరావు తెలిపారు. నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వ హంగులతో తయారైన ఈ భవనాన్ని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఈ నెల 22న ప్రారంభిస్తారని వారు తెలిపారు. సొంత భవనం లేక సిబ్బంది రోగులు ఇబ్బంది పడే వారిని అన్నారు. మంత్రి చొరవతో రూ.1.78 కోట్లతో కొత్త భవనాన్ని నిర్మించారని అన్నారు. ప్రసూతి, చిన్నపిల్లల వైద్య సేవలు అత్యవసర వైద్య సేవలు, డెంటల్, నేత్ర సంబంధ వ్యాధులకు నిపుణులు అందిస్తారని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలో కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. నూతన భవనంలో నిరంతరం వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని, పరిసర ప్రాంతాల ప్రజలు ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు.

రివిజన్ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశవ్యాప్తంగా బిఎస్ఎన్ఎల్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ రివిజన్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఆలిండియా బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని క్రాంతి భవన్‌లో అసోసియేషన్ 14వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2017 నుంచి రివిజన్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం అలసత్వం చూపుతోందని అన్నారు. ఉద్యోగులపైనా, పెన్షనర్లపై అనుసరిస్తున్న వైఖరి హేతుబద్ధంగా లేదన్నారు. సమావేశంలో సంఘం నాయకులు కె.ఎస్.మూర్తి, జిల్లా కార్యదర్శి కె.ఎస్.ప్రసాదరావు, కోశాధికారి మన్మధరావు, సహాయ కార్యదర్శి డి.పోలయ్య, ఎన్.అప్పలరాజు, జి.రామారావు, పి.మల్లేశ్వరరావు, ఎం.పాపారావు పాల్గొన్నారు.

నూతన పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బేసిక్ సైన్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ జి.వాసంతి రచించిన 'కాన్సెప్ట్ ఆఫ్ ఇంజినీరింగ్ మేథమేటిక్స్' అనే పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తన ఛాంబర్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ప్రస్తుతం వైజ్ఞానిక విజ్ఞాన కంప్యూటర్ రంగంలో అత్యధిక ప్రాధాన్యత సంతరించుకుంటున్న గణిత శాస్త్రానికి సంబంధించిన ఇటువంటి పుస్తకం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రచయితను అభినందిస్తూ ప్రస్తుత విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రచించిన ఈ పుస్తకంలోని అంశాలు విద్యార్థులకు సరళంగా బోధపడతాయని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు ఈ పుస్తకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇటువంటి మరిన్ని పుస్తకాలను రచించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్చిడి డాక్టర్ శాంతి కుమార్, పలువురు డీన్లు, హెచ్ఓడిలు, బోధన, బోధనేతర సిబ్బంది రచయితకి అభినందించారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

కృపారాణి పరామర్శ

కోటబొమ్మాళి: మండలంలోని చీపుర్లపాడులో వైసిపి కార్యకర్త మెండ రమేష్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, వైసిపి నాయకుడు కిల్లి రామ్మోహన నాయుడులు ఆదివారం ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని పార్టీకి సేవలు అందించాలని కోరారు. అలాగే గుండెపోటుతో ఇటీవల మృతి చెందిన పాలిన వరహాలమ్మ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ విప్ బొడ్డు అప్పన్న పాల్గొన్నారు.

రమేష్‌ను పరామర్శిస్తున్న కృపారాణి

కేన్సర్ బాధితునికి ఆర్థికసాయం

జి.సిగడాం : మండలంలోని జాడలో కొంతకాలం గా కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న సూరమ్మకు సర్పంచ్ గొకా మహేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు కుమరాపు రవికుమార్ రూ.పది వేలు ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. ఆర్థికంగా చేయూతనిస్తూ కుటుంబంలో వెలుగును నింపుతున్న స్థానిక టిడిపి నాయకుల సేవలను గ్రామస్తులు అభినందిస్తున్నారు. కార్యక్రమంలో మధుపాం సర్పంచ్ అప్పలనాయుడు టిడిపి నాయ కులు గొల్లాజి, బంగారునాయుడు, శ్రీరామ్మూర్తి, ముత్యాలరాజు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- పలాస

అర్హులందరికీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తుందని, ఎవరికైనా ప్రభుత్వ పథకాల అందకపోతే దరఖాస్తు చేసుకుంటే తక్షణమే పరిష్కరిస్తామని పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్లలో ఆదివారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా? వీధుల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా? లేవా? తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రాహ్మణతర్లలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. చాలా వీధుల్లో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. త్వరలో సచివాలయ భవన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసిల సభ్యులు దంతం వైకుంఠరావు, కర్ర గంగాధరరావు, కోరాడ నాగరాజు, వార్డు మెంబరు పొందర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'108' ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- జలుమూరు

108 వాహనాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఉద్యోగుల సంఘం వైఎస్ఆర్ టియుసి జిల్లా అధ్యక్షులు సూర్యనారాయణ కోరారు. అంబులెన్స్ సర్వీస్ నూతన డిఎం బొమ్మాళి హరిప్రసాద్‌ను నరసన్నపేటలో ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంక్రిమెంట్, ఇఎస్ఐ, ఇపిఎఫ్ తదితర సమస్యలపై వివరించి పరిష్కరించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన ఉద్యోగుల సమస్యలను ఉన్నతాధికారులకు పంపిస్తానన్నారని తెలిపారు. డిఎంను కలిసిన వారిలో జనరల్ సెక్రటరీ రాజశేఖర్, గోవింద, రామకృష్ణ, ఢిల్లేశ్వరరావు, తారక రామచంద్రరావు, రాము ఉన్నారు.

వైశ్య సంక్షేమ సంఘం యువజన కార్యవర్గం ఎంపిక

ప్రజాశక్తి- పలాస

పలాస వైశ్య సంక్షేమ మహిళా సంఘం అధ్యక్షులుగా మల్లా సౌజన్య, యువజన సంఘం అధ్యక్షుడిగా మల్లా గణేష్, కార్యదర్శిగా తంగుడు కార్తీక్, కోశాధికారిగా వడ్డి శ్యాంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం వాసవీ కన్యకాపరమేశ్వరి వైశ్య సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు మల్లా కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు మల్లా భాస్కరరావు ఆధ్వర్యాన ఆదివారం నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఈ నెల 27న నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం నిర్వహిస్తారని నిర్వాహకులు ప్రకటించారు. వీరి ఎంపికపై వైశ్య సంక్షేమ, యువజన సంఘాల నాయకులు మల్లా సురేష్ కుమార్, పి.వి.సతీష్, మల్లా పద్మజ, మల్లా జయశ్రీ, కొత్తకోట తిరుమలరావు, తంగుడు కనకరాజు, మల్లా యుగంధర్, టంకాల రవి శంకర్ గుప్తా అభినందించారు.

రక్తదానం చేస్తున్న చిరంజీవి అభిమానులు

వంద మంది రక్తదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సినీ నటుడు చిరంజీవి జన్మదిన ఉత్సవాలను పురస్కరించుకుని ఆయన కుటుంబ అభిమానులు అరసవల్లిలో కూడలిలోని ఓ కళ్యాణ మండపంలో న్యూబ్లడ్ బ్యాంకు సహకారంతో ఆదివారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా ఈ శిబిరాన్ని సుధీర్‌వర్మ ప్రారంభించి మాట్లాడారు. నటుడుగా ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకున్న చిరంజీవి బాటలోనే అభిమానులు నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. ఈ మేరకు వంద మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమాన సంఘం నాయకులు తైక్వాండో శ్రీను, రాజా, దళిత జెఎసి నేత డాక్టర్ కంఠ వేణు, కె.వెంకటేశ్వరరావు, జి.ప్రసాద్, వైశ్యరాజు మోహన్ పాల్గొన్నారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

కృష్ణమూర్తిని సన్మానిస్తున్న రచయితలు

'తెప్పల'కు సాహితీ పురస్కారం

ప్రజాశక్తి- పలాస

ఒడిశా రాష్ట్రం బరంపురంలో ఆంధ్రా భాషా వర్ధన సమాజం ఆధ్వర్యాన రచయిత్రి తుర్లపాటి రాజేశ్వరి రచించిన 'భారత స్వతంత్రంలో ఒడిశా తెలుగు యోధులు' పుస్తకావిష్కరణ సభలో పలాస జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి సాహితీ పురస్కారం లభించింది. అనంతరం కృష్ణమూర్తికి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు పూడిపెద్ది సత్యనారాయణ, నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత వైస్ ఛాన్సలర్ బాలమోహన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

కేక్‌ను కట్ చేస్తున్న జోగినాయుడు

ఫొటోలు.. విలువైన తీపి జ్ఞాపకాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నో విలువైన తీపి జ్ఞాపకాలను ఎప్పటికీ మన కళ్లముందు ఉంచేది ఛాయాచిత్రము మాత్రమేనని జర్నలిస్టుల ఫోరమ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు శాసపు జోగినాయుడు అన్నారు. నగరంలో సాయి యూనిక్ ఫొటో ఎంపోరియం యజమాని పొదుగు ఆనంద గజపతిరావు ఆధ్వర్యాన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లూయిస్ డాగ్ రే 184వ జన్మదినం సందర్భంగా ప్రపంచ ఫొటోగ్రఫీ డే ఉత్సవాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.